ప్రజాశక్తి

ఆదివారం 21 సెప్టెంబర్ 2025 | 5 | అనంతపురం



రిషిత స్కూల్ వద్ద బ్రిడ్జి నిర్మించాలి

ఎమ్మెల్యే దగ్గుపాటికి సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

తపోవనం నుంచి నీలిమా సర్కిల్‌కు వెళ్లే దారిలో రిషిత పబ్లిక్ స్కూల్ వద్ద తక్షణమే బ్రిడ్జి నిర్మించాలని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి కోరారు. ఈమేరకు శనివారం సిపిఎం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ రిషిత పబ్లిక్ స్కూల్ వద్ద ఉన్న బ్రిడ్జి పూర్తిగా ప్రమాదకరంగా ఉందని, వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉందన్నారు. బ్రిడ్జి వద్ద ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో ధర్నాలు రాస్తారోకోలు రిలే నిరాహార దీక్షలు చేపట్టి నగరపాలక సంస్థ అధికారులకు యంత్రాంగానికి అనేకమార్లు వినతిపత్రాలు అందజేశామన్నారు. అయితే త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని అధికారులు సమాధానం ఇవ్వడమే తప్ప అది ఆచరణలో జరగడం లేదన్నారు. స్పందించి రిషిత పబ్లిక్ స్కూల్ వద్ద బ్రిడ్జి నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నీలిమ సర్కిల్ నుంచి తపోవనం వరకు రోడ్డు వేయాలన్నారు. నడిమివంకలో సైడ్ వాల్ లేకపోవడంతో వర్షాలు వచ్చినప్పుడు సమీప ఇళ్లల్లో వరద నీరు చేరి క్రిమి కీటకాలు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తక్షణమే నడిమి వంకకు సైడ్‌వాల్ నిర్మించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నగర కార్యదర్శి రావిరెడ్డి

నత్తనడకన పల్లె అభివృద్ధి..!

పంచాయతీరాజ్ పరిధిలో సాగని పనులు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు నత్తనడకన నడుస్తున్నాయి. ప్రధానంగా పంచాయతీరాజ్ శాఖ పరిధిలో జరుగుతున్న పనులు ఈ ఏడాది నామమాత్రంగానే సాగుతున్నాయి. డిజిటల్ లైబ్రరీలు, బల్క్ కూలింగ్ యూనిట్ల పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి.

అనంతపురం జిల్లాలో

అనంతపురం జిల్లాలో మొత్తం 3556 పనులు నడుస్తున్నాయి. వీటి విలువ రూ.871.52 కోట్లు .ఇందులో అంతకుముందు పనులు స్పిల్ ఓవర్ కింద 3538 పనులు రాగా ఈ ఏడాది 18 పనులు కొత్తగా చేపట్టారు. ఇందులో చూసినప్పుడు ఇప్పటి వరకు 2795 పనులు పూర్తయ్యాయి. 394 పనులు పురోగతిలోనున్నాయి. ఇంకా 367 పనులు ఆరంభానికే నోచుకోలేదు. పనులు ఇప్పటికీ ప్రారంభం కాకుండా ఉన్న వాటిల్లో ఎక్కువ శాతం డిజిటల్ లైబ్రరీలు, బల్క్ కూలింగ్ యూనిట్లు ఉన్నాయి. 186 డిజిటల్ లైబ్రరీలు నిర్మాణం చేపట్టాల్సి ఉండగా కేవలం ఒక్కటి మాత్రమే పూర్తయింది. ఎనిమిది పురోగతిలోనున్నాయి. తక్కిన 177 పనులు ప్రారంభమవలేదు. 127 బల్క్ కూలింగు యూనిట్లు నిర్మాణం చేపట్టాల్సి ఉండగా ఐదు పూర్తయ్యాయి. 15 పురోగతిలోనున్నాయి. 107 ప్రారంభానికే నోచుకోలేదు. 2024లో మంజూరైన సిసి రోడ్ల పనులు 14 ప్రారంభమవలేదు. ఎఎంసి రోడ్ల నిర్వహణ 27 ప్రారంభం కాలేదు. మొత్తంగా రూ.479.03 కోట్ల పనులు జరిగాయి. ఇందులో రూ.65.73 కోట్లు బకాయిలున్నాయి.


సత్యసాయి జిల్లాలో మరింత అధికం

సత్యసాయి జిల్లాలో పనుల పురోగతి మరింత తక్కువగా ఉంది. మొత్తం 3489 పనులు మంజూరయ్యాయి. రూ.734.74 కోట్ల విలువైన పనులు మంజూరై ఉన్నాయి. ఇందులో 2334 పనులు పూర్తవగా 985 పురోగతిలోనున్నాయి. 170 పనులు ఇంకా ప్రారంభమవలేదు. ఈ ఏడాది మొత్తంగా చూస్తే సిసి రహదారుల పనులు, బిటి రోడ్డు పనులు కలిపి రూ.29.56 కోట్ల పురోగతి మాత్రమే ఉంది. ఇంకా ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. మొత్తం ఇప్పటి వరకు రూ.392.98 కోట్ల విలువైన పనులు జరిగాయి. ఇక్కడ రూ.117.44 కోట్లు బకాయిలున్నాయి. ఇక్కడ కూడా డిజిల్ లైబ్రరీలు 161 మంజూరయితే 127 పనులే ప్రారంభమవలేదు. ఎఎంసి రోడ్ల నిర్వహణ పనులు కూడా ప్రారంభానికి నోచుకోని వాటిల్లో అత్యధికంగానున్నాయి. ఇప్పటికీ అనేక అనేక సచివాలయాల నిర్మాణాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు పురోగతిలోనే ఉన్నాయి. సకాలంలో బిల్లులు వస్తాయో లేదోనని కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో అన్ని పనులు నత్తనడకన నడుస్తున్నాయి.

నూతన కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం అర్బన్ నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. నాలుగు రోజుల క్రితం కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఓ.ఆనంద్‌ను కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువతో సత్కరించారు. ఇందులో భాగంగా నగరంతోపాటు నాలుగు పంచాయతీల పరిధిలోని అంశాల గురించి చర్చించారు. ముఖ్యంగా జిల్లా కేంద్రం కావడంతో ఇక్కడ సామాజిక, ఆర్థిక, వ్యాపార ఇతర అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు కార్యక్రమాల గురించి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కలెక్టర్ ఆనంద్ దృష్టికి తీసుకెళ్లారు. అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ, నడిమివంక, మరువవంకల ప్రొటెక్షన్ వాల్స్, రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు వంటి వాటిని కలెక్టర్‌కు వివరించారు. అలాగే ప్రస్తుతం డంపింగ్ యారులో చెత్తను



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అవసరం మేరకే యూరియా వాడకం

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

వ్యవసాయ పంటలకు యూరియా వాడకం మోతాదుకు మించి చేయకుండా రైతులను చైతన్య పరచాలని వ్యవసాయ అధికారులు, డీలర్లకు ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు సూచించారు. పట్టణంలోని డ్వామా కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని ఎరువుల దుకాణాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎప్పుడు లేని విధంగా రాయదుర్గం నియోజకవర్గంలో యూరియా లభించడం లేదని రైతులు నా దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయం పై ఇప్పటికే వ్యవసాయ శాఖ మంత్రి, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, జాయింట్ కలెక్టర్, స్థానిక వ్యవసాయ అధికారులు తో మాట్లాడి సమస్యను కొంతవరకు పరిష్కారం చేసినప్పటికీ సమస్య ఇంకా ఉందన్నారు. ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా పడటంతో సాగు కూడా గణనీయంగా పెరిగినట్లు కారణంగా చెప్పారు. పంటలకు వాడాల్సిన మోతాదు కంటే ఎక్కువగా వాడుతుండడం మరో కారణంగా చెప్పారు. పంటలకు ఎంత మోతాదులో యూరియా వినియోగించాలనే పూర్తి సమాచారాన్ని తెలియజేసే పోస్టర్లను విడుదల చేశారు. నియోజకవర్గవ్యాప్తంగా వచ్చిన యూరియా వివరాలను వ్యవసాయ అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం సహాయ వ్యవసాయ సంచాలకులు పద్మజ, వ్యవసాయ అధికారులు అహ్మద్ బాషా, నిర్మల్ కుమార్, జగదీష్, సాయి కుమార్, కృష్ణకిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు



మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న శ్రీకాంత్ వడ్ల

ట్రెల్లిస్ స్కూల్‌కు 'ఎక్సలెన్స్' అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం నగరంలోని ట్రెల్లిస్ స్కూల్ టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్ నుంచి "ఉద్యోగుల భావోద్వేగ సంబంధం మరియు నాయకత్వంలో ఎక్సలెన్స్" అవార్డును అందుకుంది. ఈ అవార్డును రాష్ట్ర పౌర సరఫరాలు, ఆహారం, వినియోగదారులు వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నుంచి అందుకున్నారు. ఈ అవార్డును అందుకోవడం తమకు సంతోషాన్ని ఇస్తోందని ట్రెల్లిస్ స్కూల్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ శ్రీకాంత్ వడ్ల తెలిపారు. ట్రెల్లిస్ స్కూల్ ఉద్యోగులు తమకు గొప్ప ఆస్తులన్నారు. వారి అభివృద్ధికి అవకాశాలను అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

కూల్చివేతలే జగన్ పాలన

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వైసీపీ అధినేత జగన్ రెడ్డికి కూల్చడాలు తప్ప.. నిర్మించడాలు తెలియవని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శించారు. నగరంలోని 47వ డివిజన్ పరిధిలోని రంగస్వామి నగర్‌లో జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్‌తో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ నగరంలో 71,867 రేషన్ కార్డులు ఉండగా ఇప్పటికే 45శాతం వరకు పూర్తైందని.. మిగిలిన వారికి నెలాఖరులోపు పూర్తి చేస్తామని తెలిపారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ విజన్‌తో మొత్తం డిజిటలైజేషన్ చేస్తున్నారన్నారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా అంతా డిజిటలైజేషన్ ఉంటుందన్నారు. ప్రభుత్వం మెడికల్ కళాశాలను ఎక్కడా ప్రయివేటీకరణ చేయడం లేదన్నారు. వైసీపీ నాయకులు గతంలో కేంద్ర ప్రభుత్వం నుంచి తీసుకొచ్చిన మెడికల్ కళాశాలల నిధులను పక్కదారి పట్టించారని విమర్శించారు. జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో జిల్లాకు ఒక్క పరిశ్రమ కూడా రాలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనా 15 నెల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ సారథ్యంలో 10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ తహశీల్దార్ హరికుమార్, పార్లమెంట్ అంగన్వాడీ అధ్యక్షురాలు, క్లస్టర్ ఇంచార్జ్ దలవాయి రమాదేవి, టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణ, టిడిపి నాయకులు నరేంద్ర చౌదరి, దాడి శ్రీనివాసులు, చేపల హరి పాల్గొన్నారు.



స్మార్ట్ రేషన్‌కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రతిభా ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి-అనంతపురం

పోలీసు శాఖలో పని చేస్తూ ఉపాధ్యాయులుగా నియమితులైన, ఎఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతులు పొందిన వారిని శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ పి.జగదీష్ ఘనంగా సత్కరించారు. జిల్లా పోలీస్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్ స్టడీ సెంటర్, డిజిటల్ లైబ్రరీలో సన్నద్ధమైన వారు, పోలీస్ పరేడ్ మైదానంలో సాధన చేసిన వారిలో 48 మందికి కానిస్టేబుల్ ఉద్యోగాలు వచ్చాయి. అలాగే పోలీసు కానిస్టేబుళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఐదుగురికి టీచర్ ఉద్యోగాలు పొందారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1993-1995 బ్యాచ్‌కు చెందిన 36 మందికి హెడ్ కానిస్టేబుళ్ల నుంచి ఎఎస్‌ఐలుగా పదోన్నతి కల్పించారు. వీరందరూ ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, గాండ్ల హరినాథ్, సరోజ, తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీకి బొకే అందజేస్తున్న ఉద్యోగోన్నతి పొందిన ఎఎస్‌లు

తహశీల్దార్ కార్యాలయ భవనం.. పునాదులకే పరిమితం.!

తుప్పుపట్టిన ఇనుప కడ్డీలు-పెరిగిన పిచ్చి మొక్కలు

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండల కేంద్రంలోని మండల రెవెన్యూ కార్యాలయం పనులు పునాదులకే పరిమితమైంది. గత ఐదేళ్ల క్రితం అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో రెవెన్యూ కార్యాలయ భవనం చేపట్టారు. అయితే టిడిపి ప్రభుత్వం ఓటిమి చెందడంతో అధికారం చేపట్టడం వైసిపి ప్రభుత్వం పూర్తిగా నూతన తహశీల్దార్ కార్యాలయ భవన నిర్మాణం గురించి పట్టించుకోలేదని చెప్పవచ్చు. పునాదులకు నిర్మించిన ఇనుప కడ్డీలు తుప్పుపట్టాయి. మరికొన్ని పునాదుల్లో పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో రెవెన్యూ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే ప్రస్తుతం టిడిపినే తిరిగి అధికారంలోకి రావడంతో మండల రెవెన్యూ కార్యాలయ భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



తుప్పుపట్టిన కడ్డీలతో దర్శనమిస్తున్న తహశీల్దార్ కార్యాలయ భవనం

కార్మికుల జీవితాలతో చెలగాటం తగదు

రాయదుర్గం ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి-రాయదుర్గం

కార్మికుల జీవితాలతో రాయదుర్గం ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్ మెర్సీ జ్ఞాన సుధా నియంత వైఖరి తగదని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున అన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన మాటే శాసనంగా శాసిస్తూ వైద్యశాలలో పని చేస్తున్న కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. గత 12నెలల క్రితం రవి అనే కార్మికుని ఒక ఘటనలో విధులకు దూరంగా పెట్టిన ఆమె ఇప్పటికీ విధుల్లోకి తీసుకోకుండా ఆ కార్మికుని కుటుంబంతో చెలగాటం ఆడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుని సమస్యను సిఐటియు నాయకత్వం సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లిన సందర్భంగాలో రెండు నెలల తర్వాత విధుల్లోకి తీసుకుంటామని చెప్పినా 12 నెలలు గడుస్తున్నా విధుల్లోకి తీసుకోకపోలేదన్నారు. అంతేగాకుండా కార్మికుడిని విధుల్లోకి తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, డిసిహెచ్‌ఎస్, వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులందరూ చెప్పినప్పటికీ వారందరి ఆదేశాలను పట్టించుకోలేదన్నారు. ఆనాడు జరిగిన ఘటనకు ప్రధాన కారకురాలైన నర్సును విధుల్లోకి తీసుకుని, రవిని ఎందుకు తీసుకోలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆసుపత్రిలో నియంతలా వ్యవహరిస్తున్న సూపరింటెండెంట్‌పై వెంటనే చర్యలు తీసుకోవడంతోపాటు కార్మికుడిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిఐటియు అనుబంధ సంఘాలు, ప్రజా, కార్మిక, విద్యార్థి సంఘాలను ఐక్యం చేసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

జ్వరాల నివారణకు ప్రత్యేక చర్యలు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా సబ్ యూనిట్ అధికారులందరూ ఆశా, ఎఎన్ఎం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సూపర్‌వైజర్లు, వైద్యాధికారులతో సమన్వయం చేసుకుంటూ డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ఇబి దేవి సూచించారు. శనివారం స్థానిక కార్యాలయంలో జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో తరచూ డెంగీ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో జాగ్రత్త వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి యాంటీ లార్వా, దోమల నియంత్రణకు స్ప్రేయింగ్, ఫాగింగ్ చర్యలు చేపట్టాలనాన్రు. జ్వర బాధితులను ప్రభుత్వ ఆసుపత్రులకు పంపి సత్వరమే అవసరమైన చికిత్స తీసుకునేటట్లు చూడాలని ఆదేశించారు. ప్రయివేటు ఆసుపత్రుల నిర్వాహకులు తమ ఆసుపత్రుల్లో జ్వరంతో చేరిన రోగుల నుంచి సీరం శాంపిల్స్ సేకరించి డెంగీ నిర్ధారణకు అనంతపురం వైద్య కళాశాలలోని మైక్రో బయాలజీ ల్యాబ్‌కు పంపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులు, ఆరోగ్య విస్తరణ అధికారి గిరిధర్‌రెడ్డి, అనంతపురం, గుత్తి, తాడిపత్రి, కళ్యాణదుర్గం, రాయదుర్గం సబ్ యూనిట్ అధికారులు, సూపర్‌వైజర్లు రమేష్, శ్రీధర్‌మూర్తి, మధు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి ఇబి దేవి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గుత్తి : పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీ విశ్వనాథ ఆచారి, జూనియర్ సివిల్ జడ్జిలు జి. మంజుల, అనిల్‌కుమార్ నాయక్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక న్యాయస్థానాల ప్రాంగణంలో మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం స్వభయ్ స్వచ్ఛత- సంస్కార స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మొక్కలను నాటారు. ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిడి.రత్నం, కోర్టు సూపరింటెండెంట్‌లు నరసింహారెడ్డి, గీత, వరలక్ష్మి, ఎజిపి పి.పక్రుబాషా, న్యాయవాదులు వైఎ కబీర్, ఆర్.రామ్‌గోపాల్ ఎం.శ్రీధర్, పి.చంద్రకాంతరెడ్డి, జెడ్ సతీష్ లక్ష్మీనారాయణ, ఎంవి.మహేష్, ఎస్ఎండి ఇస్మాయిల్, పరమేశ్వర్ రెడ్డి, నూర్ మహమ్మద్, సాలప్ప, ఓబులేష్, కోర్టు టైపిస్ట్ ఎస్. సాదిక్‌వలి తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీరు పోస్తున్న జడ్జి

కార్పొరేట్ సెలూన్లను తొలగించాలని వినతి

గుంతకల్లు : పట్టణంలో ఏర్పాటు చేసిన కార్పొరేట్ సెలూన్ దుకాణాలను తొలగించాలని పట్టణంలోని నాయీ బ్రాహ్మణులు ఆర్‌డిఒ శ్రీనివాసులుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు చేపట్టిన 3వేల మంది ప్రజలు చేసిన సంతకాల ప్రతులు, క్షవర వృత్తిదారుల డిమాండ్లను ఆర్డీవోకు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాసులు, ఎంఆర్‌పిఎస్ నాయకుడు స్వామిదాసు వృత్తిదారుల సమస్యలను ఆర్డీఓకు వివరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకుడు రమేష్, సిపిఎం నాయకులు తిమ్మప్ప, నాయీబ్రాహ్మణ సంఘం సంఘం అధ్యక్షుడు బెలగంటి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి సూరి, కోశాధికారి బ్రహ్మ, సంఘం నాయకులు అజయ్, శివ, వాసు, ఎర్రిస్వామి, చరణ్, బాల, కుమార్, స్వామి, బాలకృష్ణ, అనిల్ పాల్గొన్నారు.

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

కళ్యాణదుర్గం టౌన్ : రాష్ట్రంలో విఆర్‌ఎలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని విఆర్‌ఎల సంఘం నాయకులు ఓబులేష్, వెంకటేశులు, రాజశేఖర్, హనుమంతు, గంగన్న డిమాండ్ చేశారు. విఆర్‌ఎ అసోషియేషన్ పిలుపుమేరకు దశలవారీగా చేపట్టిన ఆందోళనలో భాగంగా ఆర్‌డిఒ వసంతబాబుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేస్ స్కేల్ అమలు, నామినీలను వీఆర్‌ఏలుగా నియమించాలని, అర్హులకు ప్రమోషన్, కారుణ్య నియమాకాలు లాంటి వాటిని పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వ హయంలో నిర్వహించిన ఛలో విజయవాడ కార్యక్రమం సందర్భంగా విఆర్‌ఎలపై నమోదైన కేసులను రద్దు చేయాలని కోరారు.

వడ్డెర్లు అన్నిరంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-గుత్తి

వడ్డెర సామాజికవర్గ ప్రజలు అన్నిరంగాల్లో రాణించాలని ఓడ్ కమ్యూనిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (జాతీయ వడ్డెర కౌన్సిల్) ఎపి రాష్ట్ర అధ్యక్షులు డేరంగుల లక్ష్మీదేవమ్మ పిలుపునిచ్చారు. బోర్డు కమ్యూనిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఒసిసిఐ) రాష్ట్ర అధ్యక్షులుగా డి.లక్ష్మీదేవమ్మ, ఆర్గనైజింగ్ ప్రధాన కార్యదర్శి బత్తల మారుతీప్రసాద్ ఎన్నికయ్యారు. దీంతో స్థానిక ఆర్ అండ్ బి అతిథి గహంలో శనివారం మండల వడ్డెర సంఘం సమావేశం నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన ఇరువురిని పూలమాలలతో సత్కరించారు. ముందుగా పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న రేనాటి వీరుడు వడ్డెర ఓబన్న విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డి.లక్ష్మీదేవమ్మ మాట్లాడుతూ ఒసిసిఐ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. వడ్డెర సంఘం ఆధ్వర్యంలో కులస్తుల కోసం సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఒసిసిఐ రాష్ట్ర ఆర్గనైజింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మారుతీప్రసాద్, సూర్యవంశ ఒడియ రాజుల సంఘం అధ్యక్షుడు పీట్లా చిరంజీవి, గౌరవాధ్యక్షుడు హనుమంతు, సర్పంచి ఎం.చంద్ర, నాయకులు వరదరాజులు, వీరన్న, మునేష్, తదితరులు పాల్గొన్నారు.

బీ.ఫార్మసీ, ఫార్మా-డీ, ఎంఎస్సీ పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన బీ.ఫార్మసీ, ఫార్మా-డీ, ఎంఎస్సీ పరీక్ష ఫలితాలను శనివారం విడుదల చేశారు. బీ.ఫార్మసీ 2వ సంవత్సరం 2వ సెమిస్టర్ (ఆర్.23) రెగ్యులర్, బీ.ఫార్మసీ 2వ సంవత్సరం 2వ సెమిస్టర్ (ఆర్.19), (ఆర్.15) సప్లిమెంటరీ, బీ.ఫార్మసీ 2వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్.23), (ఆర్.19), (ఆర్ 15) సప్లిమెంటరీ ఫలితాలు, ఫార్మా-డి1 వ సంవత్సరం (ఆర్.17) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఫార్మా-డి 2వ సంవత్సరం (ఆర్.14) సప్లిమెంటరీ, ఫార్మా-డి 5వ సంవత్సరం (ఆర్.17) అడ్వాన్స్ సప్లిమెంటరీ పలితాలు, ఎంఎస్‌సి 2వ సెమిస్టర్ (ఆర్.21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంఎస్సీ 1వ సెమిస్టర్ (ఆర్.21) సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను శనివారం విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ వి.నాగప్రసాద్ నాయుడు, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ఎపి శివకుమార్ అడిషినల్ కంట్రోలర్స్ జి.శంకర్ శేఖర్‌రాజు, శ్రీధర్ తెలిపారు.

యూరియా కొరతతో రైతుల ఇక్కట్లు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులకు యూరియా కొరతతో ఇక్కట్లకు గురవుతున్నారు. మండలవ్యాప్తంగా 15 సచివాలయాలు ఉండగా వీటిలో కొన్ని సచివాలయాలకు మాత్రమే అధికారులు యూరియాను అందుబాటులో ఉంచి మిగిలిన వాటిల్లో ఉంచకపోవడంతో రైతులు యూరియా కోసం అనేక అవస్థలు పడుతున్నారు. మొదటి, రెండో విడతల్లో పంపిణీ చేసినప్పటికి ఇంకా రైతులకు యూరియా అవసరమై ఉంటున్నందున రైతులకు సరిపడగా యూరియాను అందించకలేకపోతున్నారని పలువురు రైతులు విచారం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటి వరకు చింటూరు, మేడిమాకులపల్లి, చిత్రచేడు, లక్ష్మంపల్లి, పెద్దవడుగూరు, విరుపాపురం, దిమ్మగుడి, చిన్నవడుగూరు సచివాలయాలకు మాత్రమే యూరియా అందించారు. వచ్చిన యూరియాను కొందరు నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి యూరియాను కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని రైతులు చర్చించుకుంటున్నారు.

రోడ్ల మరమ్మతులకు నిధులివ్వండి

డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌ను కోరిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల



పవన్‌కళ్యాణ్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే

శింగనమల నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. ఈమేరకు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసి నియోజకవర్గ రోడ్ల అభివృద్ధిపై వినతిపత్రం అందజేసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ పరిధిలోని చాలారోడ్లు అభివృద్ధికి నోచుకోక నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో అనేక గ్రామాల్లో రోడ్లు చాలా అధ్వాన్న పరిస్థితుల్లో ఉన్నాయన్నారు. ఈనేపథ్యంలో కురిసిన వర్షాలకు గ్రామీణ ప్రాంతాల రోడ్లన్నీ దెబ్బతిన్నాయన్నారు. కావున పంచాయతీరాజ్ శాఖ తరపున రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే గండికోట రిజర్వాయర్ నీటి ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర నివేదికను ఆర్‌డబ్ల్యుఎస్, మిగతా శాఖల అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ముఖ్యంగా పుట్లూరు, యల్లనూరు మండలాల్లో నీటి సమస్య పరిష్కారానికి గండికోట నీటి ప్రాజెక్టు ఎంతో సౌలభ్యంగా ఉంటుందన్నారు. జల్ జీవన్ మెషీన్ ద్వారా నీటి ప్రాజెక్టులకు పంచాయితీ రాజ్ శాఖ తరపున అనుమతులు ఇవ్వాలని కోరారు. ఆయా విషయాలన్నీ సవ్యంగా విన్న పవన్‌కళ్యాణ్ సానుకూలంగా స్పందిస్తూ నిధుల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఆర్డీటీ సేవలు కొనసాగేనా.?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



ఆర్డీటీ సేవలు రాబోయే రోజుల్లో ఏమవుతాయోనన్న ఆందోళన సర్వత్రా నెలకొంది. గత కొన్ని నెలలుగా దీనిపై చర్చ నడుస్తూనే ఉంది. ఎఫ్‌సిఆర్ఎ పునరుద్ధరణ కాకపోతే భవిష్యత్ ఏమవుతుందోనన్న గుబులు అందరిలోనూ నెలకొంది. దేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతంగా అనంతపురం జిల్లా ఉంది. రాజస్థాన్‌లో జైసల్మీర్ తరువాత అతి తక్కువ వర్షపాతం పడే ప్రాంతంగా ఉంది. ఈ ప్రాంతంలో వెనుకబాటు, పేదరికం ఎక్కువగా ఉంది. దీంతో ఉపాధి కోసం కర్నాటక, కేరళ, మహారాష్ట్ర ఇలా అనేక ప్రాంతాలకు వేల సంఖ్యలో కుటుంబాలు ఏటా వలసలు పోతుంటాయి. పంటల సీజన్ అయిపోతూనే వలస పక్షులు వెళ్లినట్లు ఇతర ప్రాంతాలాకు వెలుతుంటారు. పేదరికం మూలనా సరైన పౌష్టికాహారం లేక ఆరోగ్య సమస్యలు, విద్య సరైనది లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి తరుణంలోనే నాలుగు దశాబ్దాల క్రితం ఈ ప్రాంతానికి ఆర్డీటీ సంస్థ వచ్చింది. తొలినాళ్లలో ఈ సంస్థ వద్దని కొంత వ్యతిరేకత వ్యక్తమైంది. అందరిలోనూ నమ్మకాన్ని కల్పించి ప్రజల్లోనూ జిల్లాలోనూ ఒక భాగమైంది. విద్యా, వైద్యం, అక్షరాస్యతే కాకుండా ఆర్థిక స్వావలంబన కోసం కూడా కృషి చేస్తూ వచ్చింది. దీంతో ఇప్పుడు ఆర్డీటీ సంస్థ జిల్లావాసుల జీవితాల్లో ఒక భాగంగా ఉంటూ వచ్చింది. ఇటువంటి సంస్థకు విదేశీ నిధులు వచ్చే విషయంలో కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు వేస్తూ వచ్చింది. లెక్కల్లో తేడాలున్నాయంటూ చూపించి నిధుల రాకుండా బ్రేకులు వేయడంతో మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇదే తరుణంలో జిల్లావాసుల్లో ఈ సంస్థ లేకుంటే ఏమవుతుందోనన్న ఆందోళన మొదలైంది. గత సోమవారం ఆర్డీటీ పరిరక్షణ కోరుతూ జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున ప్రజలు తరలొచ్చారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాల నుంచి టవర్‌క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు వేలాది మంది తరలొచ్చి కలెక్టరేట్‌ను ముట్టడించారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ ఈ అంశం చర్చకు వచ్చింది. వారం రోజుల్లోపు సమస్యలు తొలగిపోతాయని ఎంపీ అంబికా లక్ష్మినారాయణ చెప్పారు. అయితే అది వాస్తవమైతే బాగుండునని జిల్లావాసులు ఆకాంక్షిస్తున్నారు. అసలు ఆర్డీటీకీ అనుమతులు వస్తాయా లేదా అన్న సందేహాలు మాత్రం ఇప్పటికీ జిల్లావాసుల్లో తొలగిపోలేదు. కేంద్ర ప్రభుత్వం మతకోణంలోకి చూసి ఈ సంస్థపై వేటుకు సిద్ధమైందన్న ఆరోపణలున్నాయి. అయితే కూటమి నేతలు మాత్రం అటువంటిదేమి లేదు. కొత్త ఎఫ్‌సిఆర్ ద్వారా అనుమతులివ్వడం జరుగుతుందని చెబుతున్నారు. ఇవ్వకపోతే జిల్లాకు పెద్ద నష్టమే జరిగే అవకాశముండనుంది. ప్రతిపక్ష వైసిపి మాత్రం దీనిపై ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

పిపిపి మోడల్‌లో మెడికల్ కళాశాల మార్చడంపై సర్వత్రా చర్చ నడుస్తోంది. పెనుకొండలో మొదలైన పెనుకొండ కళాశాల నిర్మాణం ఆరంభమే అవలేదని అధికారపార్టీ నేతలు చెబుతుండగా, ఆరంభమై చాలా వరకు పనులు జరిగాయని వైసిపి నాయకులు చెబుతున్నారు. ఈ రెండు పార్టీల నాయకులు క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి చూపించే ప్రయత్నం చేస్తున్నారు. సిపిఎం, సిపిఐ నాయకులు మాత్రం పిపిపి విధానం వద్దని చెబుతున్నాయి. ప్రభుత్వరంగంలోనే వైద్యం ఉండాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

చెత్తకుప్పలు తొలగింపు



తిలక్‌నగర్‌లో చెత్తకుప్పలను తొలగిస్తున్న శానిటరీ సిబ్బంది

గుంతకల్లు : పట్టణంలోని తిలక్‌నగర్, రాజేంద్రనగర్, తదితర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలను అధికారులు శనివారం తొలగించారు. 'గుంతకల్లులో పడకేసిన పారిశుధ్యం'.. కంపు కొడుతున్న వీధులు.. వ్యాధుల బారిన ప్రజలు అంటూ శనివారం ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కథనానికి స్పందించిన మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్ సంబంధిత శానిటరీ ఇన్స్‌పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సచివాలయ శానిటరీ సెక్రటరీలను పురమాయించి శనివారం మధ్యాహ్నం స్థానిక ఎస్ఎల్‌వి సినిమా టాకీసు, తిలక్‌నగర్, రాజేంద్ర నగర్, తదితర ప్రాంతాల్లో ఉన్న చెత్తకుప్పలు ట్రాక్టర్ల ద్వారా కంపోస్టు యార్డుకు తరలించారు. అయితే ఇంకా అనేక వార్డుల్లో పారిశుధ్యం పనులు సక్రమంగా జరగడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ముట్టాలలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఆత్మకూరు



వైద్య శిబిరంలో పాల్గొన్న టిడిపి మండల అధ్యక్షులు బోయ శ్రీనివాసులు

మండలంలోని ముట్టాల గ్రామంలో టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధులు, ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందించారు. తర్వాత మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు ఎరువులు పంపిణీచేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ వైస్ ఎంపిపి పిల్లల ప్రతాప్, సొసైటీ గంత లింగన్న, రవీంద్ర, ముట్టాల నరసింహులు, గంతే రవీంద్ర, పారిజాతమ్మ, శ్రీనివాసులరెడ్డి, కందుల ఓబుళపతి, అక్కులన్న, మోడిండ్ల ఆదెప్ప, గూలి కొండారెడ్డి, గంటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ఇబి దేవి పిలుపునిచాచరు. శనివారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా కార్యాలయం ఆవరణలో సిబ్బందితో కలిసి కార్యాలయం ఆవరణను శుభ్రం చేయడంతోపాటు మొక్కలు నాటారు. అలాగే స్వచ్ఛాంధ్రలో బాధ్యతగా పాల్గొంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి గిరిజా మనోహర్‌రావు, డాక్టర్ యుగంధర్, డాక్టర్ విష్ణుమూర్తి, మలేరియా అధికారి నివారణ అధికారి ఓబులు, నరేంద్రరెడ్డి, ఎస్ఒ మహమ్మద్‌రఫీ, హెచ్‌ఇఒ నాగరాజు, డెమో త్యాగరాజ్, ఆరోగ్య బోధన అధికారి గంగాధర్, పిఎంఒ నాగన్న, బలరామ్‌రెడ్డి, ఎన్‌హెచ్‌ఎం కిషోర్, సురేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అపార్ ఐడి తయారు చేయండి

బెలుగుప్ప : ప్రతి అంగన్వాడీ సెంటర్‌లో 3 నుంచి ఆరేళ్ల వరకూ సెల్ఫ్ ఆధార్ కలిగి ఉన్న పిల్లలకు ఆధార్ ఐడి క్రియేషన్స్ చేయాలని డాక్టర్ కార్తీక్ కుమార్‌రెడ్డి సూచించారు. శనివారం మండల పరిధిలోని కాలువపల్లి మినీ హెల్త్ కేంద్రంలో పోషణ వారోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ ఈ కరణ అనగా అన్ని పనులను రికార్డులు, సేవలను కంప్యూటర్ మొబైల్, ఇంటర్నెట్ ద్వారా నిర్వహించడం, పుస్తకాల్లో రాసుకునే బదులు డేటాను కంప్యూటర్లలో భద్రపరచడం వంటి సేవలను ఆన్‌లైన్‌లో అందించడమే డిజిటలీకరణ అంటారన్నారు. ఈ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, అంగన్వాడీ వర్కర్లు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
I.A.No:19/2025 in I.P.No24/2022
Between:
1)ఎ.రామాంజలు రెడ్డి Died by LRs
2) ఎ.విజయకుమారి W/o లేట్ A. రామాంజలు రెడ్డి
3) ఎ.అనిల్‌కుమార్ రెడ్డి S/o లేట్ A. రామాంజలు రెడ్డి
...అర్జీదారులు/LRs of Petiotioner
ఎదిరి
1)R.అంకరాజు Died by LRs
2) R.శారద
3)B.శంకర నారాయణ రెడ్డి
4) B.వెంకట ప్రవీణ్ కుమార్ రాజు
...రెస్పాండెంట్స్/రెస్పాండెంట్స్
To,
R4) రాంపల్లి వెంకట ప్రవీణ్ కుమార్ రాజు S/o లేట్.రాంపల్లి అంకరాజు: D.No.15/1268, C/o డ్యాన్స్ స్కూల్, సంజీవ్‌నగర్ 1వ రోడ్, తాడిపత్రి టౌన్, అనంతపురం జిల్లా.
4వ రెస్పాండెంట్‌కు నోటీసులు
U/O.22R.3(1) OF C.P.C. R/W.R.28 OF C.R.P ప్రకారము
పై అర్జీలో అర్జీదారులు చనిపోయిన ఎ.రామాంజలు రెడ్డి యొక్క వారసులుగా తమను చేర్చమని పై కోర్టులో పై అర్జీని దాఖలు చేసియున్నారు. సదరు అర్జీని కోర్టు వారు మీ హాజరు నిమిత్తము 25-09-2025వ తేదిన వాయిదా వేసి ఉన్నారు. కావున ఆ దినము మీరు ఉదయం 10:30 గంటలకు పై కోర్టు ఎదుట మీరు ఖుద్దున గాని, వకీలు ద్దారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. లేనియెడల మీ పరోక్షములో కోర్టువారు తీర్మానము చేయుదురు.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
సి.రమేష్‌నాథ్ రెడ్డి & వై.హనీఫ్ బాష
అడ్వకేట్లు, తాడిపత్రి &
జెడ్.సతీష్,
అడ్వకేట్, గుత్తి

మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
I.A.No:13/2024 in I.P.No24/2022
Between:
1)ఎ.రామాంజలు రెడ్డి **...అర్జీదారుడు/క్రిడిటార్**
ఎదిరి
1)R.అంకరాజు Died by LRs
2) R.శారద
3)B.శంకర నారాయణ రెడ్డి
4) B.వెంకట ప్రవీణ్ కుమార్ రాజు
...రెస్పాండెంట్స్/రెస్పాండెంట్స్
To,
R4) రాంపల్లి వెంకట ప్రవీణ్ కుమార్ రాజు S/o లేట్.రాంపల్లి అంకరాజు: D.No.15/1268, C/o డ్యాన్స్ స్కూల్, సంజీవ్‌నగర్ 1వ రోడ్, తాడిపత్రి టౌన్, అనంతపురం జిల్లా.
4వ రెస్పాండెంట్‌కు నోటీసులు
U/O.22R.4(1) OF C.P.C. R/W.Sec.151 Of C.P.C. ప్రకారము
పై అర్జీలో అర్జీదారులు చనిపోయిన రాంపల్లి అంకరాజు యొక్క వారసునిగా మిమ్ములను చేర్చమని పై కోర్టులో పై అర్జీని దాఖలు చేసియున్నారు. సదరు అర్జీని కోర్టు వారు మీ హాజరు నిమిత్తము 25-09-2025వ తేదిన వాయిదా వేసి ఉన్నారు. కావున ఆ దినము మీరు ఉదయం 10:30 గంటలకు పై కోర్టు ఎదుట మీరు ఖుద్దున గాని, వకీలు ద్దారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. లేనియెడల మీ పరోక్షములో కోర్టువారు తీర్మానము చేయుదురు.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
సి.రమేష్‌నాథ్ రెడ్డి & వై.హనీఫ్ బాష
అడ్వకేట్లు, తాడిపత్రి &
జెడ్.సతీష్,
అడ్వకేట్, గుత్తి

స్వచ్ఛ రాయదుర్గం ఏర్పాటుకు సహకరించండి

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం



మొక్క నాటి నీరు పోస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

స్వచ్ఛమైన ప్రాణవాయువును అందించే ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు రాయదుర్గం ప్రజలు సహకరించి చేయూతనివ్వాలని విప్ కాలవ శ్రీనివాసులు కోరారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా శనివారం రాయదుర్గం పురపాలక సంఘం ముత్తరాశి కాలనీలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా పురపాలక సంఘ అధ్యక్షులు పొరాళు శిల్పతో కలిసి వీధులు శుభ్రం చేయడంతోపాటు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి పిలుపుమేరకు స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని జన్మదినం సెప్టెంబర్ 17 నుంచి గాంధీ జయంతి. అక్టోబర్ 2వతేదీ వరకు స్వచ్ఛ ఉత్సవ్, స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పట్టణంలోని కాలుష్యం, అపరిశుభ్రత అధికంగా ఉన్న ప్రదేశాల్లో పురపాలక మండలి సభ్యులు స్థానికులు బృందాలుగా ఏర్పడి ఆయా ప్రాంతాల పరిశుభ్రతకు పచ్చదనానికి కషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు సభ్యులు శ్రీలక్ష్మి, లావణ్య, శారద, ప్రశాంతి, కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహశీల్దార్ నాగరాజు, మున్సిపల్ ఇంజినీర్ సురేష్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవీంద్ర, మెప్మా టిఎంసి నారాయణరెడ్డి, టిడిపి నాయకులు మహబూబ్‌బాషా, వెంకటేశులు, హనుమంతు, కృష్ణమూర్తి, పురుషోత్తం, భారతి, సంపత్‌కుమారి, నాగరాజు, ఆంజనేయులు, శ్రీనివాసులు, శివ, ఆనంద్, మెప్మా ఆర్పీలు, సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత 'అనంత'గా మారుద్దాం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. శనివారం నగరంలోని సూర్యానగర్ రోడ్డులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవానీ రవికుమార్, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, మున్సిపల్ కమిషనర్ బాలాస్వామితో కలిసి నగరంలో పరిశుభ్రత పచ్చదనంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తర్వాత డివైడర్ల మధ్యలో మొక్కలు నాటారు. తర్వాత నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతామని అధికారులు, ప్రజలతో ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తలారి ఆదినారాయణ, కోనంకి గంగారామ్, రంగాచారి, పోతుల లక్ష్మీనరసింహులు, పిఎల్‌ఎన్ మూర్తి, కడియాల కొండన్న, బొమ్మినేని శివ, కార్పొరేటర్లు జనబలం బాబా, బాలాంజనేయులు, సింగవరం రవి, రాజారావు, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ కృష్ణకుమార్, సంగా తేజస్విని, ఫిరోజ్ అహ్మద్, సాకే లక్ష్మీనరసింహ, సుధాకర్ యాదవ్, మోహన్‌కుమార్, తమ్మినేని శ్రీవర్ధన్, గోపాల్‌గౌడ్, రూపనగుడి రవి రాయల్, దాడి మల్లికార్జున పాల్గొన్నారు.

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

ప్రజాశక్తి-రాయదుర్గం

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా శనివారం సోమలాపురంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛతపై విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుతోపాటు పారిశుధ్యంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో పెయింటింగ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ షేక్ అజ్మతుల్లా, క్యాషియర్ దినేష్‌కుమార్, ఉపాధ్యాయులు పార్వతీ, రూపాదేవి, విజయశాంతి, అనిల్‌కుమార్, బ్యాంక్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీ

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణానికి తాగునీరు అందించే డాక్టర్ వైఎస్ఆర్ రక్షిత తాగునీటి పథకం పైప్‌లైన్ లీకేజీ ఏర్పడినట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కణేకల్ సమ్మర్ స్టోరేజ్ వద్ద పంపింగ్ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి నీరు బయటకు వెళ్తోందన్నారు. యుద్ధ ప్రాతిపదికన లీకేజీకి మరమ్మతులు చేపట్టలని ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. దీనివల్ల ఆదివారం నీటి పంపింగ్ జరగదని, రాయదుర్గంలో తాగునీటి సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.


తిరుపతి రైలును పెద్దపల్లి వరకు నడపాలని వినతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కళ్యాణదుర్గం ప్రాంతంలో నడిచే ఒకే ఒక్క తిరుపతి రైలును కదిరిదేవరపల్లి నుంచి పెద్దపల్లి వరకూ నడపాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కోరారు. ఈమేరకు శనివారం బెంగళూరులో కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నను ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి రైలును ప్రస్తుతం కదిరిదేవరపల్లి వరకూ మాత్రమే నడుపుతున్నారన్నారు. అయితే ట్రాక్ పనులు పూర్తి కావడంతో పెద్దపల్లి వరకూ తిరుపతి రైలును నడపాలని కోరారు. ఇందుకు కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

12వ వారం అన్నదానం

ప్రజాశక్తి-శింగనమల



దాతలను సన్మానిస్తున్న ఎంపిడిఒ భాస్కర్

రుషి శృంగ మహాముని, రంగరాయల జ్ఞాపకార్థం మండల పరిధిలోని శింగనమల క్లాస్‌లో చేపట్టిన అన్నదాన కార్యక్రమం శనివారం 12 వారానికి చేరుకుంది. ఈ సందర్భంగా జె.రాంచరణ్‌యాదవ్ మాట్లాడుతూ 12వ వారం అన్నదానానికి శింగనమలకు చెందిన లగుశెట్టి చంద్రమోహన్ మనవడు సౌర్యన్ విరాజ్ రాయల్ పుట్టినరోజు సందర్భంగా సహకరించినట్లు తెలిపారు. అనంతరం స్వామివారి సన్నిధిలో లఘుశెట్టి చంద్రమోహన్‌కు శాలువా కప్పి, స్వామివారి చిత్రపటాన్ని అందజేసి సన్మానించారు. అలాగే అనంతపురం మాసూలు ఆంజనేయులు కుమారుడు ప్రసాద్ 104 కిలోల ధాన్యం, రూ.2,500 విలువజేసే నిత్యావసర సరుకులు స్వామివారి సన్నిధిలో అందజేసినట్లు తెలిపారు. అలాగే శివపురం గ్రామవాసి పట్రా పెద్ద వెంకటప్ప 50 కిలోల ధాన్యం, చిన్నజలాలపురం ఓబుళపతి 25 కిలోలు, శివపురం శీనా 50 కిలోలు, శివపురం రమేష్ 25 కిలోల ధాన్యాన్ని అన్నదానానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ క్లస్టర్ కార్యదర్శిగా గొర్తి వెంకట్

ప్రజాశక్తి-అనంతపురం



నియాకమపత్రం అందుకుంటున్న గొర్తి వెంకటస్వామి

అనంతపురం రూరల్ మండల పరిధిలోని పాపంపేట స్కూల్ కాంప్లెక్స్ క్లస్టర్ కార్యదర్శిగా కక్కలపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న గొర్తి వెంకటస్వామి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈమేరకు పాపంపేట జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పుల్లా లక్ష్మీదేవితో నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు ప్రత్యేకంగా అభినందించారు. 1996 డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన వెంకటస్వామి తొలుత యాడికి మండలం రామరాజుపల్లి ఎంపీపీ స్కూల్లో పని చేశారు. 1999లోనే అక్కడ టిసి సెంటర్ కార్యదర్శిగా ఎంపికయ్యారు. 2011లో కృష్ణమరెడ్డిపల్లి ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తూ చియ్యేడు సెంటర్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమగ్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ సొంత నిధులతో పాఠశాలకు మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నారు. అంతేగాకుండా ప్రభుత్వ పాఠశాలలో 1998 ఆగస్టు నుంచి 2025 ఆగస్టు 15 వరకూ 50సార్లు జాతీయ పతాకాన్ని ఎగురవేసి అరుదైన ఘనత కూడా సాధించారు.

సి.శోభాబిందుకు ఉత్తమ ఇంజినీర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న శోభాబిందు

అనంతపురం : జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల సిఎస్ఇ విభాగం అధ్యాపకురాలు, డైరెక్టర్ ఫ్యూచర్ స్కిల్ డెవలప్‌మెంట్, ఇంకుబేషణ్ సెంటర్ సి.శోభాబిందు ఉత్తమ ఇంజినీర్స్ అవార్డు అందుకున్నారు. ఈమేరకు శనివారం విజయవాడలోని డాక్టర్ కెఎల్.రావు భవన్‌లో నిర్వహించిన ఉత్తమ ఇంజినీర్స్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో అవార్డును అందజేశారు. అవార్డు పొందిన శోభాబిందును జెఎన్‌టియు విసి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఒఎస్‌డి వీసీ ఎన్.దేవన్న, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయండి

గుంతకల్లు : దసరా పండుగ సందర్భంగా పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో 11 రోజులుగా నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు గోపా జగదీష్ పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం ఆలయం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షులు చెల్లూరు నరసింహులు, ప్రధాన కార్యదర్శి కందూరి కృపాకర్, కోశాధికారి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి జయంతి సూర్యనారాయణ, కార్యవర్గ సభ్యులు గుంతా రమేష్‌బాబు, భవన నిర్మాణ కమిటీ ఛైర్మన్ మేడా ప్రహ్లాద, పూజా కమిటీ సభ్యులు ఇ.వెంకట సుబ్బయ్య, కె.సుబ్రమణ్యం, టి.రమేష్, వెంకట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

యాడికి : మండల పరిధిలోని రాయలచెరువులోని పలు ఎరువుల దుకాణాలను విజిలెన్స్, వ్యవసాయ అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా న్యూ లక్ష్మీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్, భాస్కర ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. న్యూ లక్ష్మీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ దుకాణంలో రికార్డులు సరిగా లేని రూ.1,85,000 ఎరువుల విక్రయాలను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం, ఎఒ వాసుప్రకాష్, విజిలెన్స్ ఎస్ఐ నరేంద్రభూపతి, మండల వ్యవసాయ అధికారి మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

4, 5 వార్డుల్లో 'మోసం గ్యారెంటీ'

రాయదుర్గం : పట్టణంలోని 4, 5వ ఎన్నికల వార్డుల్లో వైసిపి నాయకులు 'బాబు షూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పొరాళు శిల్ప, మున్సిపల్ వార్డు సభ్యులు గోవిందరాజులు, శారద, ఫక్రుద్దీన్, కోఆప్షన్ సభ్యులు నజీర్, మాజీ సభ్యులు వసంతరాజు, వైసిపి పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, మాజీ కన్వీనర్ ఆరవ శివప్ప, చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి పొరాళు శివ, నాయకులు నిజాం, రామాంజనేయులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

రాప్తాడు : ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ ఆదేశాల మేరకు మండల పరిధిలోని పాలచర్ల సచివాలయంలో రైతులకు 200 బ్యాగుల యూరియా పంపిణీ చేశారు. అనంతరం సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు గవ్వల నరేష్, ఇండస్టెంట్ పవన్, వడ్డే గోపాల్, డీలర్ రామ్మోహన్‌రెడ్డి, గంజి రాము, వడ్డే గోవింద్, గొల్ల సంఘం అధ్యక్షుడు గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : మండల వ్యవసాయ అధికారి ఎ.వెంకటకుమార్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ జిఎం అల్తాఫ్ అలీఖాన్ ఆదేశాల మేరకు శనివారం 140 బస్తాల యూరియాను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికార బి.మురళీకృష్ణ, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి రాగే మురళి, సర్పంచు గురుప్రసాద్, టిడిపి నాయకులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది నళిని, మల్లికార్జున, భరత్, జయచంద్ర పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతోనే విజయాలు

గుత్తి : ప్రతి ఒక్కరూ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని తద్వారా జీవితంలో గొప్ప విజయాలను సాధించవచ్చని ప్రపంచ రికార్డు గ్రహీత, మోటివేషనల్ స్పీకర్ ఎం.నాగప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్, డిప్లొమా చదువుతున్న విద్యార్థులకు ఇన్స్పిరేషనల్ టాక్ సిరీస్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ విజె పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ఎండి రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్, ఎఒ ఇంతియాజ్‌బాషా, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

నార్పల : వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో గ్రామస్థాయి అధికారులకు పంట కోత ప్రయోగాలపై శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా పంట కోత ప్రయోగాల ప్రాముఖ్యత, అవగాహన కల్పించే పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల సహాయ గణాంక అధికారి కృష్ణయ్య మాట్లాడుతూ పంటకోత ప్రయోగాలు ఏ విధంగా నిర్వహించాలో సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సి.చన్న వీరస్వామి, వ్యవసాయ విస్తరణ అధికారి సి.ప్రసాద్, రైతు సేవాకేంద్రాల అధికారులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీయడం అభినందనీయం

అనంతపురం : మోడల్ మార్కెట్ ప్రదర్శనతో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం అభినందనీయమని నెంబర్-1 పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహ్మద్‌గౌస్ అన్నారు. శనివారం పాతూరులోని యెన్ విఆర్ ఫౌండేషన్ పాఠశాలలో శ్రీ కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు ఉమాదేవి ఆధ్వర్యంలో 1, 2వ తరగతుల విద్యార్థులకు మోడల్ మార్కెట్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే విద్యార్థులకు ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు .ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శాంతి ప్రకృతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు హనుమంతు, తెలుగు వెలుగు అధ్యక్షులు టీవీ రెడ్డి, పివికెకె కళాశాల వెంకట్, రమణబాబు, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ 'స్మార్ట్' కార్డులు

యాడికి : మండల కేంద్రంలోని ప్రజలందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందజేసాయతమని డీలర్లు నరసింహచౌదరి, మధురాజు ఆదినారాయణ యాదవ్, రామాంజనేయులు తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ యాడికి గ్రామ పంచాయతీ పరిధిలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడంలో కాస్త ఆలస్యం అవుతున్న మాట వాస్తవమే అన్నారు. అయితే ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. రానివారికి మీ ఇంటి దగ్గరకే సచివాలయ సిబ్బంది వచ్చి స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తారన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగార్థులకు సన్మానం

గుంతకల్లు : కానిస్టేబుల్ మెయిన్ పరీక్షలో విజయం సాధించి ఉద్యోగాలు పొందిన అభ్యర్థులను డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు సురేంద్రబాబు ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీ సాయి ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో ఘనంగా సత్కరించారు. కానిస్టేబుల్ మెయిన్స్‌లో విజయం సాధించిన ఉద్యోగాలకు ఎంపికైన రాజశేఖర్, రమేష్, కిషోర్, శివ, సాయితేజ, ప్రేమ్‌కుమార్‌ను రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఆర్కే నాయుడు, రిటైర్డ్ ప్రభుత్వ ఆసుపత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ కమలమ్మ, శ్రీసాయి ఉమెన్స్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ప్రభాకర్, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, ఐద్వా పట్టణ ప్రధాన కార్యదర్శి రంగమ్మతో శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు రంగా,చంద్ర తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తకు ఆర్థికసాయం

బుక్కరాయసముద్రం : టిడిపి కార్యకర్త ఖలీద్‌కు మాజీ జెడ్పీటీసీ కట్టప్పగారి రామలింగారెడ్డి శనివారం ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఖలీద్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న రామలింగారెడ్డి బాధితుడికి వైద్యఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బోలే అక్కులప్ప, వడ్డే సుంకన్న, నూర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

నార్పల ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా శేషారెడ్డి



నార్పల : మండల ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా శేషారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపిడిఒ మమతాదేవి మెడికల్ లీవ్‌లో ఉన్నందున స్థానిక మండల పరిషత్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఉన్న శేషారెడ్డిని ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా నియమిస్తూ జిల్లా పరిషత్ కార్య నిర్వహణ అధికారి నుంచి ఉత్తర్వులు వచ్చాయి.

రహదారి భద్రతపై అవగాహన

అనంతపురం : స్థానిక ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాలలో కళాశాల వైస్ ఛైర్మన్ సి.చక్రధరరెడ్డి ఆధ్వర్యంలో శనివారం రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వి ప్రసాద్ మాట్లాడుతూ వేగం కన్నా ప్రాణాలు కాపాడుకోవడం అవసరమన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మోటారు వాహనాల ఇన్స్‌పెక్టర్ జె.సునీల్‌కుమార్, కళాశాల ఒఎ శ్రీనాథ్, జాతీయ సేవా పథకం అధికారులు జి.ఆనంద్‌బాబు, టి.సుదర్శన్‌రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గొర్రెలకాపరి ఆత్మహత్య

పెద్దవడుగూరు : మండలంలోని చింతలచెరువు గ్రామానికి చెందిన గొర్రెల కాపరి రమణ (38) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. గొర్రెల కాపరిగా ఉన్న రమణ కుటుంబ సమస్యల కారణంగా శుక్రవారం రాత్రి ఇంట్లో గొడవపడి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు వెంటనే కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం ఉదయం మృతిచెందినట్లు చెప్పారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారని భార్య చౌడేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.